సాక్షి
మహబూబాబాద్
శనివారం । 9 । మార్చి । 2024

శివోహం



- వైభవోపేతంగా మహాశివరాత్రి వేడుకలు
- కురవి ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- వీరభద్రుడిని దర్శించుకున్న ప్రముఖులు
- కనుల పండువగా స్వామివారి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి మూలవిరాట్



కురవి:

కురవి వీరభద్రస్వామి ఆలయం శివ నామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం కురవిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి కల్యాణ మహోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం తెల్లవారుజాము నుంచే ఆలయానికి పోటెత్తారు. హరహర మహాదేవ శంభో శంకరా, వీరభద్ర శరణు శరణూ అంటూ భక్తులు స్మరించుకున్నారు. ఆలయంలో బలిహరణ, స్వామి శావను ప్రదక్షిణ చేయించి గ్రామసేవకు పంపించారు. ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి దగ్గరుండి ప్రముఖులు, భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ధర్మకర్తలు భక్తులకు సేవలందించారు.

క్యూలో కిక్కిరిసిన భక్తులు..

భద్రకాళీ ఆలయం, స్వామి ఆలయం, ఆలయం బయట క్యూలైన్లలో భక్తులు కిక్కిరిసిపోయారు. ఆలయం ఎదుట నుంచి కల్యాణ మండపం వరకు కలకత్తా పండాల్స్(టెంట్లను) ఏర్పాటు చేయడంతో నీడలో భక్తులు క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎస్పీ ఆలయంలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై బి.గోపి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ సేవలందించారు. దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

ప్రముఖుల దర్శనం..

వీరభద్రస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్



స్వామి వారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

రాంచంద్రునాయక్ దంపతులు దర్శించుకున్నారు. ప్రజలు సుఖఃసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు వివరించారు. వారిని ఆలయ ఈఓ సత్యనారాయణ సత్కరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరభద్రుడు అందరిపై దయ చూపాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ దంపతులు, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, కురవి జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి దర్శించుకున్నారు. వివిధ పార్టీల నాయకులు అంబటి వీరభద్రం, రాజేందర్‌కుమార్, ఎర్ర నాగేశ్వర్‌రావు, అవిరె మోహన్‌రావు, కాలం రవీందర్‌రెడ్డి, బోడ శ్రీను, ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్ దర్శించుకున్నారు.



స్వామివారి దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు



స్వామివారి కల్యాణ వేడుకను తిలకించడానికి తరలివచ్చిన అశేష భక్తజనం

వైద్య సేవలు..

మానుకోట డీఎంహెచ్ అంబరీష ఆధ్వర్యంలో డాక్టర్లు స్రవంతి, విరాజిత నేతృత్వంలో జాతరకు వచ్చిన భక్తులకు వైద్య సిబ్బంది వైద్య సేవలను అందజేశారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట నుంచి కురవికి బస్సులు నడిచాయి. భక్తుల సౌకర్యార్థం పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు సేవలందించారు. వారి సేవలను భక్తులు కొనియాడారు.

స్వచ్ఛంద సంస్థలు..

జాతరకు వచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవలందించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటిని అందజేశారు. బాలునాయక్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

- మరిన్ని ఫొటోలు 8, 9లో▸

కనుల పండువగా వీరభద్రుడి కల్యాణం

వీరభద్రస్వామి కల్యాణ వీరభద్రుడిగా ముస్తాబై శుక్రవారం గ్రామసేవకు బయలుదేరి వెళ్లారు. కల్యాణ వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవారి ఉత్సవ మూర్తులను వేర్వేరు శావల్లో ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో ప్రదక్షిణలు చేయించారు. రాత్రి 7.10 గంటలకు శావలు ఆలయం నుంచి గ్రామ సేవకు వెళ్లాయి. గ్రామ పంచాయతీ వద్ద రెండు శావలు వేరుపడ్డాయి. గ్రామంలోని గండిమైసమ్మ వద్ద వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారి శావలు ఎదురుపడ్డాయి. వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారి తరఫున గ్రామ పెద్దలు కూర్చొని కట్నకానుకలు మాట్లాడారు. భక్తులు కాగడాలను వెగిలించడంతో ఎదుర్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. అక్కడి నుంచి రెండు శావలు కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకులు వేదికపై రాత్రి 11.10గంటలకు అధిష్టించారు.ఎస్పీ, చైర్మన్, ఈఓ పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అర్ధరాత్రి 12గంటల తర్వాత కల్యాణం జరిపించారు. భక్తులు ఆసక్తిగా తిలకించారు.



ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై అధిష్టిస్తున్న అర్చకుడు

న్యూస్‌రీల్

శివపార్వతుల కల్యాణం



గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. సాయంత్రం 7గంటలకు ఆలయ చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి గృహం నుంచి మేళతాళాల మధ్య శివపార్వతుల విగ్రహాలతో బయలుదేరి లక్ష్మీ నారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివాలయం చేరుకొని కల్యాణ మండపంపై ఆలయ పూజారులు భానూప్రకాశ్‌శాస్త్రి, సతీష్‌పాండ్యే బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ వేడుక నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కల్యాణ వేడకను తిలకించారు. కాగా శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే మురళీనాయక్ ఉమా దంపతులు హాజరయ్యారు. గర్భాలయంలో శివలింగానికి అభిషేక పూజలు చేశారు.

11న ప్రజావాణి రద్దు

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్: కలెక్టరేట్‌లో ఈనెల 11న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అధికారులు, సిబ్బంది (శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు) విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలుగొద్దనే ఉద్దేశంతో ప్రజావాణి రద్దు చేశామన్నారు. ప్రజలు గమనించి ప్రజావాణి కోసం రావొద్దన్నారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటాలు



గార్ల: మహిళల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గార్లలో జరిగిన సంఘం మండల మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో అలువాల సత్యవతి, నాగమణి, సుజాత, లక్ష్మి, ఝాన్సీ, పద్మ, కమల, విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు వర్కింగ్ డే

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని యూనివర్సిటీ కళాశాలలకు, అన్ని విభాగాలకు, కార్యాలయాలకు ఈనెల 9న (రెండో శనివారం) పని దినం అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల (ఫిబ్రవరి) 23న సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకు కేయూ పరిధి అన్ని కళాశాలలకు, క్యాంపస్‌లోని అన్ని విభాగాలకు, కార్యాలయాలకు సెలవు ప్రకటించామని, ఆ సెలవుకు బదులు ఈనెల 9న రెండో శనివారం పనిదినంగా పరిగణించాలన్నారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

లా కళాశాల హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా సురేశ్



కేయూ క్యాంపస్: కేయూ లా కళాశాల హాస్టల్ అండ్ పీజీ హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకుడు ఎస్ సురేశ్‌ను నియమిస్తూ.. కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న సుదర్శన్ నుంచి సురేశ్ బాధ్యతలు స్వీకరిస్తారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సురేశ్ ఈ పదవిలో ఉంటారని రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిట్‌లో మహిళా దినోత్సవం

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. నిట్ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మంజు శర్మ, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు. వీరిరువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్లు శైలజకుమారి, రాణి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండపం.. అద్భుత కట్టడం

- వేయిస్తంభాల ఆలయానికే ప్రత్యేకం
- ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హన్మకొండ కల్చరల్ : వరంగల్ నగరంలోని వేయి స్తంభాల ఆలయంలో కల్యాణమండపం పునర్నిర్మాణం పూర్తికాగా శుక్రవారం ప్రారంభించారు. ఆలయానికే ప్రత్యేకంగా నిలిచే ఈ మండపం సహజసిద్ధంగా నిలబెట్టారు. క్రీస్తుశకం 1163లో వరంగల్‌లో కాకతీయరాజు రుద్రదేవుడు వేయిస్తంభాల దేవాలయాన్ని నిర్మించాడు. ఆలయ ప్రధాన ద్వారానికి ఎదురుగా జీవకళ ఉట్టిపడే ఉన్నతమైన పీఠంపై భారీ నందివిగ్రహం.. దాని వెనుక త్రికూటాలయానికి దక్షిణం వైపున అద్భుతమైన కల్యాణమండపం ఉంది. వేయిస్తంభాల గుడి కంటే ముందే ఈ మండపం నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1,400 చదరపు మీటర్ల వైశాల్యంతో ఉన్న దీనిలో ఉత్సవాల సమయంలో కల్యాణోత్సవాలు, పేరుల నృత్యాలు, రాజ సందర్శన సమయంలో సభలు జరిగేవి. భూకంపాల మూలంగా కల్యాణమండపం శిథిలమైపోయింది. దక్షిణంపైపు ప్రవేశద్వారం కుంగిపోయింది. మండపం అడుగు భాగంలో భూపొరల్లో నుండి నీటిపాయ వల్ల పునాది దెబ్బతింది. దీంతో భారతీ య పురాతత్వ సర్వేక్షణశాఖ పునర్నిర్మించాలని నిర్ణయించింది. అప్పటి ఏపీ విభాగానికి చెందిన కేంద్ర పు రాస్తుశాఖ అధికారి దివంగత జితేంద్రదాస్ ఆధ్వర్యంలో కొత్త నిర్మాణాలకు ప్లాన్ పరిశీ లన జరిగింది. ఇందు కోసం ఇంజనీరింగ్ ప్లానింగ్ డిజైన్‌లను, సాంకేతిక సహకారాన్ని వరంగల్ నిట్ అందజేసింది.

నిధుల మంజూరు..

కేంద్రప్రభుత్వం ద్వారా మొదట రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. మరోసారి బడ్జెట్ పెంచి రూ 5కోట్లు మంజూరు చేసింది. అప్పటికి పురావస్తు శాఖ అధికారులు సరిపోతాయో లేదన్న సందేహం వ్యక్తం చేశారు. 2022 ఏప్రిల్ 22న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వేయిస్తంభాల దేవాలయాన్ని సందర్శించిన క్రమంలో మండపం దుస్థితిని చూసి వెంటనే మరో రూ.15కోట్లు మంజూరు చేశారు. దీంతో



పూర్తిస్థాయిలో నిర్మితమైంది.

పునర్నిర్మాణ పనులు...

2005 జూలై 13న పాత మండపం శిలలను ఒక్కొక్కటిగా తొలగించారు. 2006 అక్టోబర్‌లో కల్యాణ మండపం పునర్‌నిర్మాణ పనులను అప్పటి ఉమ్మడి రాష్ట్ర మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ప్రారంభించారు. తర్వాత పనులకు అంతరాయం ఏర్పడి తిరిగి 2010 ఫిబ్రవరి 25న మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. తమిళనాడుకు చెందిన స్థపతి శివకుమార్ ఆధ్వర్యంలో 50మంది పనుల్లో నిమగ్నమయ్యారు. తిరిగి ఉపయోగించడానికి వీల్లేకుండా ఉన్న శిలలకు బదులుగా కొత్తగా 132పిల్లర్లు, 160 బీమ్ శిలలు, శిల్పాలను చెక్కారు. కాకతీయులు ఉపయోగించిన శాండ్‌బాక్స్ టెక్నాలజీ ఆధారంగా పనులు ప్రారంభించారు. పనుల్లో మీటరు మందంతో దంగు సున్నం, ఇసుక, కరక్కాయ, బెల్లం మిశ్రమాలతో తయారుచేసిన పదార్థం ఉపయోగించి లేయర్‌ను నిర్మించారు. దీనిపై ఏడు వరుసలు రాతి నిర్మాణంలో మొదలయ్యే ప్రదక్షిణ పథం నిర్మించారు. దీనిపై ఏడు వరుసలు ఉండే కక్షాసనం నిర్మించారు. ఆపై రాతిగోడ నిర్మాణం పూర్తి చేశారు. భూకంపాలను తట్టుకునే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు.

పునాదుల నిర్మాణంపై వివాదం..

మండపం నిర్మాణం విషయంలో పునాదులు ఎలా ఉండాలి అన్న విషయమై వరంగల్ ఆర్కియాలజికల్ సర్వే అధికారులకు, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులకు, వరంగల్ నిట్ అధికారుల మధ్య విభేదాలు రావడం వల్ల పనుల్లో తొలుత జాప్యం ఏర్పడింది. ఈ మేరకు ఈ జాప్యాన్ని తొలగించడానికి పలువురు చరిత్రాభిమానులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. 2006 డిసెంబర్‌లో మండపం పునాదుల స్థలంలో పురాతనమైన జలధారలున్న బావి కనిపించడంతో కూడా వివాదాస్పదానికి దారి తీసింది. ర్యాఫ్ట ఫౌండేషన్‌పై నిర్మించాలా లేదా డిజైన్‌లు ఏవైనా మార్పు చేయాలన్నది చర్చనీయాంశంగా మారింది. అన్ని అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు పూర్తయ్యింది.

స్తంభాలు నిలబెట్టిన విధానం..

2012 అక్టోబర్ 1న ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గణపతి, నవగ్రహ వాస్తుదోష నివారణ పూజలు జరిపిన అనంతరం కల్యాణమండపం తొలిస్తంభాన్ని లాంఛనంగా నిలబెట్టారు. అప్పటి పురావస్తుశాఖ పర్యవేక్షకులు కిష్టయ్య ఆధ్వర్యంలో స్తపతి శివకుమార్, స్థానిక శిల్పులు 70మంది రాతిస్తంభాలు నిలబెట్టే పనుల్లో పాల్గొన్నారు. 13కొత్తగా చెక్కిన స్తంభాలు , 119 పాత స్తంభాలు కలిపి 132 స్తంభాలను అమర్చారు. స్తంభాలు(శిలలకు) పట్టి ఉండేలా స్టెయిన్‌లెస్ స్టీల్ పట్టిలను (క్లాప్‌లను) అమర్చారు. గతంలో కాకతీయులు కరిగించిన ఇనుమును పోసిన పోతల్లోనే స్టీల్ పట్టీలను అమర్చారు. ఆ విధంగా 2015 ఆగస్టు నాటికి పైకప్పు మినహా మండపం పునరుద్ధరణ పనులన్నీ పూర్తయ్యాయి.

ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి..

శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణమండపాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశచరిత్రలోనే కాకతీయుల పాలన స్వర్ణయుగం లాంటిదని, తుగ్లక్ సైన్యం చేసిన దాడిలో శిల్పాలు, మందిరాలతో పాటు చరిత్ర ధ్వంసమైందని, చారిత్రక కళా సంపదను కాపాడుకోవాలని పేర్కొన్నారు.

విధేయతకే పట్టం..

- మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్
- ఇక మొదలుకానున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్‌కు కేటాయించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం విడుదల చేసిన జాబితాలో ఆయన పేరును ప్రకటించారు. ఏఐసీసీ పెద్దలు సమావేశమై దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని జహీరాబాద్, చేవెళ్ల, నల్లగొండ, మహబూబాబాద్ అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకున్నారు.

ఊహించిన విధంగానే..

మొదటి నుంచి అందరూ ఊహించినవిధంగానే ఏఐసీసీ పెద్దలకు విధేయతగా ఉండే బలరాం నాయక్‌కు మళ్లీ అవకాశం వచ్చింది. ములుగు



అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బలరాం నాయక్ 2009లో తొలిసారి మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాసరావుపై 68,957ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అప్పటి మన్మోహన్‌సింగ్ మంత్రి వర్గంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీఆర్ఎస్(బీఆర్ఎస్) అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాంనాయక్ చేతిలో 34,992 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా పోటీచేసి బానోత్ శంకర్ నాయక్ చేతిలో, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి మాలోత్ కవిత చేతిలో ఓడిపోయారు. కాగా ప్రస్తుతం మళ్లీ టికెట్ ఇవ్వడంతో ప్రచారం మొదలుపెట్టనున్నారు.

బాలికల చదువుకు పెద్దపీట

మహబూబాబాద్ అర్బన్: బాలికల చదువుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఆడ పిల్లలు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరేలా తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సురేష్ మాట్లాడుతూ.. మహిళాదినోత్సవం రోజునే కాకుండా, ప్రతిరోజు మహిళలు వారి అభివృద్ధిని గుర్తు చేసుకోవాలన్నారు. మహిళలు తలుచుకుంటే కానిదేది లేదని, ప్రతి ఒక్కరు సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా చదువు నేర్చుకోవాలని, బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలికలు, మహిళలు చదువుకోవడం ద్వారా తమ పిల్లలను ప్రయోజకులను చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారన్నారు. బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళా సాధికారత సాధించి జిల్లాను అగ్రగామిగా నిలపాలన్నారు. అనంతరం సఖీ కేంద్రాన్ని సందర్శించి ఉద్యోగ, సిబ్బందికి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో సఖీ కేంద్ర అడ్మిన్ శ్రావణి, భరోసా లీగల్ అడ్వైజర్ ఉషా, పాఠశాల ఉపాధ్యాయులు మొగలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సీనియర్ సివిల్ జడ్జి సురేష్

కార్మిక చట్టాలను అమలు చేయాలి

చిన్నగూడూరు: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాత అంగడి ఆవరణలో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల రక్షణ కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే విధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, బైకులు, పెన్షన్ వచ్చేలా ఉద్యమించాలన్నారు. కార్మికుల హక్కులు కాలరాస్తే సహించేది లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, ఎనిమిది గంటల పని విధానం ఉండేలా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి మోహన్, సీఐటీయూ మండల అధ్యక్షుడు రహీం పాషా, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

ఎంజీఎం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- మంత్రి కొండా సురేఖ

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర అటవీదేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఐఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో ఎంజీఎంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సురేఖ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతనంగా నియమాకమైన నర్సులకు క్యాపింగ్, బ్యాడ్జీలను ధరింపజేసి ప్రసంగించారు. ఎంజీఎం ఆస్పత్రిలో నాల్గో తరగతి ఉద్యోగులు రోగులకు అందించే సేవలు మరువలేనివని, ప్రభుత్వం వారి సేవలను తప్పక గుర్తిస్తుందన్నారు. ఎంజీఎం ఆస్పత్రి అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమీక్షిస్తామన్నారు. అనంతరం నర్సింగ్ ఉద్యోగులతో కలిసి మహిళా దినోత్సవాల్లో వేడుకల్లో భాగంగా మంత్రి కేక్ కట్ చేశారు. మంత్రి సురేఖను నర్సింగ్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ఆల్ ఇండియా వర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ జట్లు



ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ జట్లుతో కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్: నాందేడ్‌లోని ఎస్ఆర్‌టీఎంలో ఈనెల 10 నుంచి జరగబోయే ఆల్‌ఇండియా ఇంటర్ వర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఆచార్య వెంకయ్య తెలిపారు. పురుషుల జట్టులో బి.విష్ణు, డి.గంగాధర్, కె.నాగరాజు (ఖమ్మం, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), టి.శ్రవణ్‌కుమార్, డి.రాజు, ఆర్.రవితేజ (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, హనుమకొండ) ఉన్నారు. మహిళా జట్టులో పి.శృతి, జి.వినోద (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), టి.సుమిత్ర (టీటీడబ్ల్యూఆర్డీసీ, ఉమెన్), ఎం.సింధు (కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల), సమ్రీన్ (ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ), బి.ఇందుప్రియ ఖమ్మం ప్రభుత్వ (మహిళా డిగ్రీ కళాశాల), ఈజట్లకు ఖమ్మం కేఎం డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ జె.ఉపేందర్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మహదేవపూర్: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సాహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంటును శుక్రవారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ప్రాథమిక సహకార సంఘం వద్ద కేడీసీసీ(కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ సొసైటీ)బ్యాంకు వారి సహకారంతో రూ.25లక్షల రుణంతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ హరిరాం నాయక్, ఫీల్డ్ ఆఫీసర్ రాజిరెడ్డి, సీఈఓ రాజబాబు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నెల్లికుదురు: స్నేహితుడితో కలిసి చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్ గురై మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రత్తిరాం తండాకు చెందిన గుగులోతు రవి (45) జామతండాకు చెందిన గుగులోతు నరేష్ ఆకేరు వాగులో చేపలు పట్టేందుకు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేపలు పట్టడం తెలియని రవి విద్యుత్ షాక్‌తో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యా డు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే రవి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. తన భర్త మృతికి కారణమైన గుగులోతు నరేశ్‌పై మృతుడి భార్య సుజాత ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు..



ఆదిత్య(ఫైల్)

తొర్రూరు: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ మాట్లాడుతూ... పట్టణానికి చెందిన బొమ్మగాని ఆదిత్య(20) తన సోదరుడి వివాహ ఊరేగింపు అనంతరం గురువారం రాత్రి 11 గంటల సమయంలో బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు సమీప బంక్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలోఎదురుగా వేగంగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం పాలకేంద్రం సమీపంలో ఆదిత్యను ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలయ్యాడు. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జంగమయ్యా.. నమోస్తుతే

ఘనంగా శివరాత్రి వేడుకలు **భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు**

శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. అర్చనలు, అభిషేకాలు, జాగరణ పూజలతో కోర్కెలు తీర్చాలని భక్తులు జంగమయ్యను వేడుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గంటల తరబడి క్యూలో నిలబడి శివయ్య దర్శనం చేసుకుని తరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయిస్తంభాల ఆలయం, రామప్ప, మెట్టు రామలింగేశ్వరాలయం, పాలకుర్తి సోమేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయం తోపాటు గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేసి, జాగరణ ఉపవాస దీక్షలు పాటించారు.

\- సాక్షి నెట్‌వర్క్





వేయిస్తంభాల ఆలయంలో కల్యాణఘట్టం..



కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో సహస్ర లింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



రామప్పలో నంది విగ్రహం వద్ద భక్తుల సందడి



పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు



పాలకుర్తి సోమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



రామప్ప రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



రామప్పలో పేరిణి నృత్యప్రదర్శనలో రంజిత్ బృందం



కాళేశ్వరంలో గోదావరి మాతకు మొక్కుతున్న భక్తులు



కాళేశ్వరంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేయిస్తంభాల ఆలయంలో వద్ద భక్తుల క్యూ

బ్రహ్మకుమారీలు ప్రదర్శించిన 108శివలింగాలు



మెట్టుగుట్టపై కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కురవి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో..

కేయూ దూరవిద్య అడ్మిషన్ల నోటిఫికేషన్

- ఈనెల 26వరకు దరఖాస్తుల స్వీకరణ
- బ్రోచర్‌ను ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో ఈవిద్యాసంవత్సరంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ బ్రోచర్‌ను వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, ఆ సెంటర్ డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం శుక్రవారం క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాంచంద్రం అడ్మిషన్ల వివరాలు వెల్లడించారు. డిగ్రీలో బీఏ (హెచ్‌పీపీ, ఈపీపీ, ఎస్‌పీపీ), బీకాం జనరల్ అండ్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, బీఎల్ఐఎస్‌సీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పీజీ కోర్సుల్లో ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ ఎంఎల్ఐఎస్సీ, పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 26వ తేదీవరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని, రూ.300 అపరాధ రుసుముతో ఈనెల 30వరకు దరఖాస్తులు చేసుకోవచ్చనని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో లేదా.. ఆఫ్ లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఫీజు, అర్హతల వివరాలు కేయూ దూరవిద్యాకేంద్రం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌డీఎల్‌సీఈకేయూ.కో.ఇన్‌లో చూడవచ్చని రాంచంద్రం తెలిపారు. యూజీజీ డిస్టెన్స్ ఎడ్యూకేషన్ బోర్డు, ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ సంస్థల నిబంధనలు, యూనిరవర్సిటీ చట్టం మేరకు తరగతులు ఉంటాయని అన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య మల్లికార్జున్ రెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.



నోటిఫికేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

ఈ ఏడాది నుంచే ట్రైబల్ వర్సిటీ తరగతులు

- హెచ్‌సీయూ మెంటర్‌గా నిర్వహణ
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ములుగు/ములుగు రూరల్/వెంకటాపురం(ఎం): ఈ ఏడాది(2024–25) విద్యా సంవత్సరం నుంచి సమ్మక్క– సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు ప్రారంభించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితతో కలిసి ములుగు మండలం జాకారం సమీపంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్(వైటీసీ)లో యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపు కార్యాలయాన్ని కిషన్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నోడల్ యూనివర్సిటీగా పని చేస్తుందని అన్నారు. గిరిజన యూనివర్సిటీ ములుగులో ఏర్పాటు చేయాలని కోరగానే ప్రధాన మంత్రి అంగీకరించారని తెలిపారు. పార్లమెంట్‌లో యూనివర్సిటీకి సమ్మక్క–సారక్కల పేరు పెట్టాలని ప్రతిపాదించిన వెంటనే ఒప్పుకున్నారని అన్నారు. రామప్ప అభివృద్ధికి ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కు రూ.7కోట్లు, రాష్ట్రానికి మరో రూ.60కోట్లు ఇచ్చామని తెలిపారు. దేశ విదేశాల నుంచి టూరిస్టులు వస్తుంటారని, పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని మంత్రి సీతక్కకు సూచించారు. అనంతరం రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఎక్కువ కోర్సులు అందుబాటులో ఉంచి గిరిజనులకు 35శాతం సీట్లు కేటాయించాలని కోరారు. ఇదిలా ఉండగా.. ప్రోటోకాల్ ప్రకారం ఎంపీ ఫొటో ఫ్లెక్సీలో పెట్టకపోవడం, శిలాఫలకంపై తన పేరు లేకపోవడంతో ఎంపీ కవిత అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రోటాకాల్‌కు భంగం కలిగించినట్లు సభాముఖంగా తెలిపారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పక్కన రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ కవిత

రూ.62 కోట్లతో అభివృద్ధి పనులు

రామప్ప దేవాలయాన్ని సందర్శించే పర్యాటకుల కోసం ప్రసాద్ ప్రాజెక్టు క్రింద రూ.62కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన రామప్ప దేవాలయాన్ని సందర్శించగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం కిషన్‌రెడ్డిని ఆలయ అధికారులు సత్కరించారు. రామప్ప తూర్పు ముఖద్వారం వైపున రూ.62కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను కిషన్‌రెడ్డి పరిశీలించి విలేకరులతో మాట్లాడా రు. తొలివిడతగాా మంజూరైన రూ.34కోట్లతో 20 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీ ష్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అడిషనల్ కలెక్టర్ మ హేందర్‌జీ, కంట్రోల్ ఎగ్జామినేషన్ పోరిక తుకారా ం, ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి, యూనివర్సిటీ ఇంజనీరింగ్ హనుమంతరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్, జిల్లా ఆర్కియాలజికల్ హైదారాబాద్ సర్కిల్ అధికారిణి స్మిత ఎస్ కుమారి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, మల్లేష్, కుసుమ సూర్యకిరణ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విద్యుదాఘాతంతో చిన్నారి దుర్మరణం

- వాటర్‌హీటర్‌ను పట్టుకోవడంతో ఘటన
- స్విచ్‌ఆఫ్ చేసినప్పటికీ షాక్‌కొట్టిన వైనం



గ్రేసి (ఫైల్)

రాయపర్తి: పెళ్లయ్యాక ఐదేళ్లకు జన్మించిన చిన్నారి పాప బుడి బుడి అడుగులతో ఇల్లంతా సందడిగా మారింది. కానీ, నేటినుంచి ఆ అడుగుల సవ్వడి వినబడదని తెలిసి ఆతల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన చిన్నపాక రవికిరణ్, మమతల ఒక కుమార్తె గ్రేసి(5) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఇంటి ముందు ఉన్న స్విచ్‌బోర్డుకు రవికిరణ్ ఉదయాన్నే వాటర్‌హీటర్ పెట్టుకొని వేడి నీటితో స్నానం చేసి స్విచ్ ఆఫ్‌చేసి ఉంచారు. ఈ క్రమంలో గ్రేసిని తన తండ్రి సోమయ్య వద్ద వదిలి రవికిరణ్, మమత పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. ఈ క్రమంలో ఆడుకుంటూ వెళ్లిన గ్రేసి వేలాడుతూ ఉన్న వాటర్‌హీటర్‌ను పట్టుకుంది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. చిన్నపాటి నిర్లక్ష్యం పాప ప్రాణాలు తీసిందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



రహీముద్దీన్(ఫైల్)

కేసముద్రం: చింతచెట్టు పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని కల్వల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ.రహీముద్దీన్(60) చింతకాయలను తెంపడానికి తన ఇంటి ఆవరణలోని చింతచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలుజారడంతో కిందపడ్డాడు. తీవ్రగాయాలు కాగా.. హుటాహుటిన మానుకోటలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సలీమా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

కష్టం వృథాకావొద్దని..



నారుపోసి.. నీరుపెట్టి చంటి బిడ్డలా కాపాడిన పంట పొట్టకొచ్చింది. ఇక చేతికొస్తే చాలని సంబురపడుతున్న సమయంలో నీరులేక కళ్లెదుటే ఎండిపోతున్న పంటను చూసి అన్నదాత కంగు తిన్నాడు. పంటను ఎలాగైనా కాపాడాలనుకున్నాడు. చేసిన కష్టం వృథా కావొద్దని తలిచి ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి వరిపొలానికి పదుతున్నాడు.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని గుబ్బెదుతండాకు చెందిన రైతు బోజ్యానాయక్. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

\- రాయపర్తి

గట్లకానిపర్తిలో విషాదఛాయలు

- గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని సాహిత్య అనుమానాస్పదస్థితిలో మృతి



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు

శాయంపేట: పండుగ పూట ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. హసన్‌పర్తి పరిధి భీమారంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న శాయంపేట మండలం గట్లకానిపర్తికి చెందిన సాహిత్య (17) శుక్రవారం తెల్లవారుజామున అనుమానాస్పదస్థితిలో చనిపోయింది. కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కూతురి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. యాజమాన్యమే హత్య చేసి ఉంటారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న గట్లకానిపర్తి గ్రామస్తులు పెద్ద ఎత్తున కాలేజీ వద్దకు తరలివచ్చారు. కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వల్లుల ప్రభాకర్, కవిత దంపతులకు పెద్ద కుమార్తె సాహిత్య హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా మిగిలిన ఇద్దరు కవల పిల్లలు సాత్విక, సాక్షిక నర్సంపేట ప్రాంతంలోని ఖానాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ప్రభాకర్ మెడికల్ షాపు నిర్వహిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాహిత్య కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని, చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందడంతో ఎంజీఎం మార్చురీకి మృతదేహాన్ని తరలించామని కళాశాల యాజమాన్యం శుక్రవారం ఉదయం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సాహిత్య ఎడమ చేతి మణికట్టు వద్ద కోసుకున్నట్లు ఉండటం , చేతిపై రివర్స్‌లో సారీ రాసి ఉండడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యమే తమ బిడ్డను హత్య చేసి ఉంటారని భావిస్తూ కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కళాశాల ఎదుట ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సాహిత్య రాసిన సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. సాహిత్య మృతి వార్త తెలుసుకున్న గట్లకానిపర్తి మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, మాజీ కో ఆప్షన్ గుర్రం అశోక్ తోపాటు గౌడ కులస్తులు, ప్రభాకర్ కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో కళాశాల వద్దకు చేరుకున్నారు. చివరికి పోలీసుల జోక్యంతో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. అనంతరం శుక్రవారం సాయంత్రం 6గంటలకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూడానికి గ్రామస్తులు తండోపతండాలుగా వచ్చారు. సాహిత్య మృతితో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.